విద్యుత్ అదనపు ఛార్జీలు రద్దు చేయాలి

- వామపక్ష నాయకుల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల వాగ్ధానాలకు తిలోదకాలిచ్చి ఎడా పెడా విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై పెనుభారాన్ని మోపుతోందని వామపక్ష సంఘాల నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ ప్రవేటీకరణ బిల్లుకు మద్దతిచ్చి, షరతులను శరవేగంగా అమలు చేస్తూ విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టాలనే దుశ్శాహసానికి ఒడిగట్టిందని వాపోయారు. విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వావపక్షాలు తలపెట్టిన దశల వారి ఆందోళనలో భాగంగా ఈనెల 9 నుంచి 15 వరకు జిల్లాలో నిర్వహించే సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు రానున్న కాలంలో కూడా పెంచబోమని నమ్మబలికారని చెప్పారు. తరువాత 7 సార్లు కరెంటు చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా అందిస్తానని చెప్పి నేడు నిరంతరం కోతలు ప్రజలపై వాతలు వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 1కోటి 89 లక్షలమందికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి రూ.13,500కోట్లు వృధా ఖర్చులతో ప్రజలపై బాదుడుకు సిద్ధమయ్యారని చెప్పారు. 2019-20 సంవత్సరానికి గాను రూ.670 కోట్లు ఇప్పుడు వసూలు చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ డబ్ల్యూ రాము, సిపిఐ ఎంఎల్ రమణయ్య, ఫార్వర్డ్ బ్లాక్ జయవర్ధన్ ఆర్ఎస్పీ సుబ్బరాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీబాదుల్ల, సిపిఎం నగర నాయకులు డి ఎం ఓబులేసు, సి. ఆర్. వి. ప్రసాద్ రావు పాల్గొన్నారు.

డాక్టర్ పుత్తా సతీష్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి వైద్య విభాగం నగర అధ్యక్షులుగా డాక్టర్ సతీష్ రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. రాష్ట్ర హార్టీ కల్చర్ సలహాదారులు సంబటూరు ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన కమలాపురం మండల వైసిపి నాయకులు శనివారం వైసిపి కార్యాలయంలో సతీష్ రెడ్డి ని సన్మానించారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత స్థానాలను చేరుకుని ప్రజలకు సేవ చేయాలని పార్టీ నాయకులు కోరారు. డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ తన పైన నమ్మకం ఉంచి ఇచ్చిన బాధ్యతను అందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తానని చెప్పారు. నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, మండల నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హార్టీకల్చర్ సలహాదారులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమా రెడ్డి, డిసిసి వైస్ ప్రెసిడెంట్ రాజుపాలెం సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి సుమిత్ర రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాదిక్, వైఎస్ఎంపి చెన్న కేశవ రెడ్డి, నాయకులు జగన్, నిఖిల్, విజయేంద్ర, దాసరి సురేష్, జిలాని, గఫార్, నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఎం పనితీరు అభినందనీయం

ప్రజాశక్తి-చెన్నూరు

హెచ్ఎంను సన్మానిస్తున్న ఎంఇఒ-2

అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కడప జిల్లా పరిషత్ సభాభవనంలో ఈనెల 5న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొక్కరాయపల్లె ప్రధానోపాధ్యాయురాలు హేమలతను శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి-2 సునీత హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయుని పనితీరు అభినందనీయమన్నారు. అవార్డు స్వీకరణ మరింత భాధ్యత పెంచుతుందని, విద్యార్థులలో సామర్థ్యాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలన్నారు. విద్యార్థులలో ప్రతిభను వెలికితీసేందుకు నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించాలని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ఉంటూ మన మండలానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమణయ్య, వీరనారాయణ, రిటైర్డ్ హెచ్ఎం రామచంద్రయ్య, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ రెడ్డెమ్మ, గ్రామ సర్పంచ్, సూర్య నారాయణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** మండలంలోని నాగిరెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాలలో సంకల్ప్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శిక్ష ఏక్ సంకల్ప్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆంధ్ర ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, 8వ తరగతి విద్యార్థి జ్ఞానేశ్వరి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూడా ప్రభాకర్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ శారద, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీధర్, తహశీల్దార్ నారాయణరెడ్డి, ఎంఇఒ వెంకటరమిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు' ర్యాలీ విజయవంతం : కాంగ్రెస్

కడప : కడప నగరంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కడప ఉక్కు ఆంధ్రుల హక్కు ర్యాలీ విజయవంతమైందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతమ్ రెడ్డి, ఏఐసిసి మెంబర్ గుండ్లకుంట శ్రీరాములు అన్నారు. విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం ఇందిరా భవన్ లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు విచ్చేసి కార్యకర్తలకు ఇంత పెద్ద విజయాన్ని చేకూర్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలకు మహిళా నేతలకు అందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ర్యాలీలు ఇంకా మరిన్ని చేసేలాగా కార్యచరణ రూపొందిస్తామన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాడుతామన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొట్టి పాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రమ, పట్టుదలే విజయ రహస్యాలు

ప్రజాశక్తి - కడప

విజేతలను సన్మానిస్తున్న ప్రిన్సిపల్

విజేతల విజయ రహస్యం వారి శ్రమ, పట్టుదలే అని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. శనివారం కళాశాలలో ఇటీవల న్యూఢిల్లీలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ క్యాంప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలను సాధించిన సంతోష్ కుమార్, ఉస్మాన్ భాషలకు అభినందన కార్యక్రమాన్ని శనివారం కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ఎన్‌సిసిలో చేరిన ప్రతి కేడెట్ గణతంత్ర దినోత్సవ క్యాంపు, తల సైనిక్ క్యాంపులకు హాజరు కావడం ఒక అదృష్టంగా ఉంటుందని చెప్పారు. ప్రతి విద్యార్థి తమ జీవిత ఆశయాలను నెరవేర్చుకునేందుకు శ్రమించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసిఅధికారి లెఫ్టినెంట్ మహేష్, అధ్యాపకులు డాక్టర్ రవిశేఖర్, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, రాధిక, వెంకట శృతి అధ్యాపకేతర సిబ్బంది వెంకట సుబ్బయ్య, కేడెట్లు పాల్గొన్నారు.

'కలియుగం పట్టణంలో' సినిమా చిత్రీకరణ పూర్తి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న కందుల నాని

నాని మూవీ వర్క్స్ అధ్వర్యంలో విశ్వ కార్తిక్, ఆయుషి పటేల్ జంటగా నటిస్తున్న కలి యుగం పట్టణంలో సినిమా షూటింగ్ శనివారం జిల్లాలో పూర్తయ్యిందని సినిమా నిర్మాత, కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) తెలిపారు. శనివారం నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ బస్సు ప్రాంగణంలో కొన్ని సన్నివేశాలను తెరకెక్కించిన సందర్భంగా వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజుల కాల వ్యవధిలో సినిమా షూటింగ్ ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి అయిందని చెప్పారు. చిత్ర బృందానికి, కందుల కుటుంబానికి, సహకరించిన ప్రతి ఒక్కరికీ (వివిధ ప్రభుత్వ శాఖల వారికీ) పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. దసరా పండుగకి తుది మెరుగులు దిద్ది ఈ ఏడాది చివరిలో లేక వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో సినిమాను ప్రేక్షకులకు విడుదల చేస్తామని చెప్పారు. అనంతరం చిత్ర దర్శకులు రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వాసులకు, ముఖ్యంగా జిల్లాను సినిమాలో తీయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు ఈ సినిమా మంచి సందేశాన్ని ఇవ్వటమే కాకుండా, మంచి కుటుంబ కథా చిత్రం అని ఆశాభావం వ్యక్తం చేస్తూ, విజయవంతం అవుతుందని తెలిపారు. సమావేశంలో సినీ నిర్మాత, కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), సినిమా కథ, డైలాగ్స్,స్క్రీన్ ప్లే, దర్శకత్వం రమాకాంత్ రెడ్డి, జి.మహేశ్వర రెడ్డి, కాటం రమేష్,డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ చరణ్ మాధవనేని, మ్యూసిక్ అజయ్ ఆరసాధ, స్వరాలు సమ కూర్చిన వారు చంద్ర బోస్, భాస్కర భట్ల,చిత్రం మేనేజర్ రవి కుమార్ అలంక ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాంప్రకాష్ రెడ్డి, స్టంట్ ప్రేమ్ సన్, ఆర్ట్ రవి కుమార్, కొరియో గ్రాఫర్ మోయిన్ మాస్టర్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు సతీష్, కళాశాల అడ్మి నిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, సినిమా కార్య నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

మనం.. మన గ్రంథాలయం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న చైర్మన్ ఉషారాణి

ప్రతి నెలా మొదటి శనివారం నిర్వహించే మనం - మన గ్రంథాలయం కార్యక్రమం ఈనెల 7న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఉషారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా శేషగిరిరావు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలపై దుమ్మును, బూజు దులిపి, సర్దిపెట్టి ,గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేసి, పాఠకులతో అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడూ జగన్ అన్న విజన్‌ని పాఠకులకు అందించాలని ప్రతి నెలా 'మనం- మన గ్రంథాలయం' రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికి 11 జిల్లా గ్రంథాలయాల్లో, 4 ప్రాంతీయ గ్రంథాలయాల్లో నిర్వహించామని తెలిపారు. చివరగా కృష్ణా జిల్లాల్లో కార్యక్రమాన్ని పూర్తి చేస్తే 13 జిల్లాలు పూర్తవుతాయని చెప్పారు. జిల్లా చైర్మన్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీల రూప కర్త జగన్మోహన్ రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పును ఈ గ్రంథాలయ వ్యవస్థలో తీసుకొచ్చారని పేర్కొన్నారు. అందుకు నిదర్శనగా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని నూతన భవనాల నిర్మాణాలు, పాఠకులకు అవసరమైన నూతన పుస్తకాల కొనుగోలు, గ్రంథాలయాలను కంప్యూటీకరణకు అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, లైబ్రేరియన్స్ బాబ్జీ, సుబ్రహ్మణ్యం, నవాబ్ జాన్,జేమ్స్,సిబ్బంది, శ్రీనివాసులు ,హరి, శేఖర్, పాఠకులు పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు జట్టు

ఆశీష్‌రెడ్డి

ధరణికుమార్‌నాయుడు

కడప : కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ సౌత్ జోన్ అండర్ -23 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా శనివారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. చిత్తూరు జట్టుకు చెందిన జిఎస్ ఆశీష్ రెడ్డి డబుల్ సెంచరీ, ధరణి కుమార్ నాయుడు సెంచరీ చేయడంతో చిత్తూరు జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 5 వికెట్ల నష్టానికి 485 పరుగుల భారీ స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 485 పరుగుల భారీ కోరు సాధించింది. ఆ జట్టులోని ఇ. ధరణి కుమార్ నాయుడు 117 బంతులను ఎదుర్కొని 18 బౌండరీల సహాయంతో 120 పరుగులు (సెంచరీ) చేశాడు. మరో బ్యాట్‌మెన్ జి. ఎస్. ఆశిష్ రెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించి 202 పరుగులు (డబల్ సెంచరీ) చేసి నాటౌట్‌గా నిలిచారు. కర్నూలు జట్టులోని పి. సాత్విక్ 3 వికెట్లు తీసుకున్నాడు. **మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 207/9..** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో టి. మహేంద్ర రెడ్డి సెంచరీ(101 పరుగులు నాటౌట్) చేయడంతో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లను నష్టానికి 207 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 77.0 ఓవర్లలో 207 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని టీ. మహేంద్ర రెడ్డి 101 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. కడప జట్టులోని ఆదిల్ హుస్సేన్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ఎస్ ఎం డి అస్లాం 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 12.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

వల్లూరు : రైతులు వేసిన పంటకు తప్పనిసరిగా వ్యవసాయ అధికారులు రైతులచే ఇ-క్రాప్ బుకింగ్ చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శనివారం తప్పెట్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్ పంట నమోదు గురించి ఎరువుల నిలువల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని రైతులు ఇకెవైసి 95 శాతం వరకు పూర్తయిందన్నారు. ఈనెల 10 నుంచి 15 వరకు సామాజిక తనిఖీ కోసం ఈ పంట నమోదు, రైతుల జాబితాను ప్రదర్శించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

'సీమ' ప్రాంత జీవితాలకు అద్దంపట్టే.. సగిలేటి కథ

కడప అర్బన్ : ప్రపంచ వ్యాపితంగా ఈనెల 13న విడుదల కానున్న చిత్రం సగిలేటి కథ అని, చిత్ర దర్శకులు పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజల జీవితాలకు అద్దం పట్టేలా జాతర చుట్టూ జరిగే కథతో చిత్రీకరణ పూర్తిచేసుకుందన్నారు. సినిమా తెలుగు ప్రేక్షకుల ఆదరాభిమానాలతో విజయం సాధించగలదని దర్శకులు రాజశేఖర్ సద్మాన్, నిర్మాత దేవి ప్రసాద్, హీరో రవి మహాదాస్యం ధీమా వ్యక్తం చేశారు. సినిమా ప్రమోషన్లో భాగంగా శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 36 రోజుల వ్యవధిలోనే సగిలేటి కథ పూర్తి చేశామని పేర్కొన్నారు. సినిమాలో కామెడీకి పెద్ద పీట వేశామని తెలిపారు. నిత్యం మన చుట్టూ జరిగే యదార్థ సంఘటనలను ఇతివృత్తంగా ఎంచుకుని సినిమాగా మలచినట్లు వెల్లడించారు. ఈనెల 13న ప్రపంచ వ్యాపితంగా విడుదల కానుందని, థియేటర్లలోనే సినిమాను చూసి ఆదరించాలని కోరారు.

టిడిపి కొవ్వొత్తుల ర్యాలీ

వల్లూరు : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు వల్లూరులో టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి గాంధీ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా మండల టిడిపి ఇన్‌ఛార్జి లేబాక నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, రాబోవు రోజుల్లో వైసిపి రాక్షస పాలనను అంతమొందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు సైతం లేని ఒక వ్యక్తి పరిపాలనలో ఈ రాష్ట్రం ఉందన్నారు. అలాంటి వ్యక్తి చంద్రబాబు నాయుడు అరెస్టు చేసి శునకానందం పొందుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె శ్రీనివాసులురెడ్డి, దర్శ వెంకట సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, మామిళ్ల చెన్నారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చిట్టిబాబు, బాలిరెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** నగరంలోని పోస్టాఫీసు వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్. మాధవిరెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబుకు మద్దతుగా క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్, పలువరు నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు పాల్గొన్నారు.

వల్లూరు : కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

వైద్య రంగానికి పెద్దపీట : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేసి రాష్ట్రాన్ని ఆరోగ్య వంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్ ఆర్ కాలనీ (వికలాంగుల కాలనీ) ప్రాంత సమీపంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అశోక్ నగర్, బుడ్డాయ పల్లి, పద్మావతి నగర్, పుట్లం పల్లి, రామకృష్ణ నగర్, ఉక్కాయపల్లి, వికలాంగుల కాలనీ ప్రాంతాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష 6 వ క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. వైద్యులతో, సిబ్బందితో అక్కడికి విచ్చేసిన రోగులతో వివరాలు అడిగి తెలుసుకొని కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రమణా రెడ్డి, సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్, రాజగోపాల్ రెడ్డి, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ కార్పొరేటర్లు ఎం. సుబ్బారెడ్డి, బండి ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, డాక్టర్స్ జిల్లా అధ్యక్షులు శివా నాయక్, వైద్యులు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఒంటిమిట్ట :** మండలం పరిధిలోని సాలాబాద్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హాజరై మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలు అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఒంటిమిట్ట మండల అధ్యక్షులు గజ్జల శ్రీనివాసులు రెడ్డి ఒంటిమిట్ట మండల జెసిఎస్ కన్వీనర్ రఘురాం రెడ్డి, ఎంపిటిసి అక్కి లక్ష్మీదేవి, నడింపల్లి సర్పంచ్ సొంతం సుబ్బారెడ్డి లంక రామ్ రెడ్డి, గంగి రెడ్డి , మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు రెడ్డి చంద్రారెడ్డి , కృష్ణారెడ్డి, గురుమోహన్‌రాజు, సర్పంచ్ బాషా, ఆకేపాటి శివారెడ్డి కట్ట నారాయణ బ్యాంకు శివారెడ్డి , ఎంపిటిసి నారాయణరెడ్డి, సర్పంచి ప్రతినిధి పెంచల సుబ్బయ్య మాజీ ఎంపీపీ సుబ్బయ్య సాలబాద్ నీలకంఠారెడ్డి , వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు వైద్యాధికారులు, వాలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు. **చెన్నూరు :** రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ లక్ష్యమని సికె దిన్నె జడ్‌పిటిసి సభ్యుడు పోచం రెడ్డి నరేన్ రామానుజన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండపేట జడ్‌పి హైస్కూల్లో జగనన్న సురక్ష కార్యక్రమం కొండపేట సర్పంచ్ తుంగ చంద్ర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందజేశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించి వారికి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, కొండ పేట ఎంపిటిసి నాగిరెడ్డి, వైసిపి నాయకులు మాజీ ఎంపిటిసి భాస్కర్ రెడ్డి, కేశవరెడ్డి, టి.ఎన్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపిడిఒ డి.సుబ్రహ్మణ్యం శర్మ, ఎంఆర్ఎఫ్ పటాన్ అలీ ఖాన్, డాక్టర్ చెన్నారెడ్డి, ఏటీఎం గంగాధర్, పంచాయతీ సెక్రెటరీ రామ సుబ్బారెడ్డి , సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **బి. కోడూరు :** మండలంలోని ప్రభలవీడు గ్రామ సచివాలయం పరిధిలో ఎంపిడిఒ విజయభాస్కరరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్ రాజు, డాక్టర్ ఉదయ్ కిరణ్, మండల వైసిపి కన్వీనర్ చౌదరిరామా కృష్ణారెడ్డి, బి కోడూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది సచివాలయం ఆశా, ఆరోగ్య మిత్ర, ఓ. సుధాకర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు. **చాపాడు:** జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం అందుతుందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. పల్లవోలు గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారని తెలిపారు. పల్లవోలు సచివాలయంలో 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీటితోపాటు కంటి వెలుగు పథకం కింద పరీక్షల నిర్వహించి దాదాపు 30 మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య, ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు, డాక్టర్ ఓబులేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ, వైస్ ఎంపిపి సుందరమ్మ, సర్పంచ్ ప్రసాద్, రమణయ్య, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** మండలంలోని పెదనపాడు సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్యశ్రీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుని అవసరమైన మందులను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఇఒ రంతుల్లయ్య, జడ్పిటిసి బాలయ్య, పెదనపాడు సర్పంచ్ ధనలక్ష్మి, కోడూరు సర్పంచ్ వాసుదేవరెడ్డి, వైద్యులు జోత్స్న, సాయిచరిత, విష్ణువర్ధన్, విజయ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబి వలలో డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ

ప్రజాశక్తి-కమలాపురం

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ

కమలాపురం నియోజకవర్గంలోని వీర పునాయునిపల్లె మండలం రెవెన్యూ కార్యాలయంపై ఎసిబి అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.30 వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, విఆర్ఒ మునిక్రిష్ణ పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఎసిబి ఎఎస్‌పి దేవప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వెల్లటూరికి శేఖర్ అనే రైతు ఒక ఎకరా పొలం చుక్కల భూమిని ఆన్‌లైన్ ఎక్కించుకోవడానికి 2012 సంవత్సరం నుండి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడని పేర్కొన్నారు. ఎంత తిరిగినా ప్రయోజనం లేక రైతు అధికారులను గట్టిగా అడిగాడని తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలంటే ఖర్చుతో కూడుకుందని తెలిపారని చెప్పారు. ఇందు కోసం రూ.50 వేలు అవుతుందని రెవెన్యూ అధికారులు రైతుకు చెప్పారని పేర్కొన్నారు. రైతు శేఖర్ చేసేదేమి లేక తమను సంప్రదించారన్నారు. లంచం అడుగుతున్నారని ముందస్తు సమాచారం ఇచ్చారని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో సిఐలు అలీ, శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ నరేష్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహిం చామన్నారు. డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నామని తెలిపారు. వారివురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎవరైనా అధికారులు లంచం అడిగితే ఎసిబిని సంప్రదించాలన్నారు. 14400 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

డిఇఒ అవినీతిపై ఆధారాలు సమర్పించాం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆధారాలను అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి అవినీతిపై ఆధారాలను విచారణాధికారికి సమర్పించామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్‌కుమార్, సగిలి రాజేంద్రప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. డిఇఒ అవినీతి ఆరోపణలను విచారించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణకు హాజరు కావాలని ఎస్ ఎఫ్ఐ నాయకులకు నోటీసులు పంపగా శనివారం వారు డిఆర్‌డిఎ కార్యాలయానికి వెళ్లారు. 23 ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను విచారణాధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి జిల్లాకు వచ్చినప్పటి నుంచి అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేకుండా నడుస్తున్న పాఠశాలలకు సంభంధించి పిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోక పోవడం దారుణమన్నారు. భీరం శ్రీధర్ రెడ్డి స్కూల్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి విషయంలో డిఇఒ డబ్బులు అడిగారని, ఇవ్వని కారణంగానే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ విషయం ఆ పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి చేసిన ఆరోపణలపై ఇప్పటికీ ఎందుకు విచారించి చర్యలు తీసుకోలేదో చెప్పాలని ప్రశ్నించారు, నాడు - నేడు పనుల్లో జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారించి చర్యలు తీసుకోవాల్సిన డిఇఒ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను అసభ్య పదజాలంతో దూషిస్తూ మానసికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. తాను చెప్పినట్లు చేయలేదని కడప నగరంలోని చంద్ర మౌళి స్కూల్ యాజమాన్యాన్ని వేధిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ డిఈఓ కార్యాలయం వద్ద ఆందోళన కూడా చేపట్టారని చెప్పారు. ఉపాధ్యాయ బదిలీలలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని, ఉపాధ్యాయ సంఘాలు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను విచారణ అధికారికి సమర్పించారు. డిఇఒ కార్యాలయంలో తనకు అనుకూలమైన వారిని పెట్టుకుని వారితో పైరవీలు నడుపుతున్నట్లు అనేక ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. వీటన్నింటిపై లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

'పుత్తా'కు ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు

కడప : వార్డు సభ్యులుగా గెలవలేని పుత్తా నరసింహారెడ్డికి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిని విమర్శించే స్థాయి లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ పులి అనిల్ కుమార్ అన్నారు. శనివారం వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు పుత్తా నరసింహారెడ్డిని ఎప్పుడో వెలివే శారన్నారు. వార్డు మెంబర్ కూడా గెలవలేని పుత్తాకు ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదని చెప్పారు. కబ్జాలు, రౌడీయిజం, దౌర్జన్యం చేసే పుత్తాఎక్కడ , అభివృద్ధి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఎమ్మెల్యే ఎక్కడ అని అన్నారు. స్థాయికి తగ్గట్టు విమర్శలు చేస్తే బాగుంటుందని సూచించారు. సమా వేశంలో వైసిపి ఎస్‌సిసెల్ విభాగం జిల్లా అధ్యక్షులు సి. హెచ్.వినోద్ కుమార్, కొండూరు మాజీ సర్పంచ్ ఎం.రాజారెడ్డి, ఎం.భగవాన్ రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి 2023 సంవత్సరానికి గాను వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సు చేరడానికి సీటు పొందిన వారికి ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని వైవీ యూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వైవీయూలో పీజీ కోర్సులో సీటు పొందిన విద్యార్థులందరూ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్టు చేయాలన్నారు. మూడురోజుల్లో ఏ రోజైనా రిపోర్టు చేయవచ్చని తెలిపారు.

పిడికిలి

ప్రజాదృష్టి

మరోసారి ఉక్కు పిడికిలి బిగిసింది. 2014 రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీల్లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ ప్రధానమైంది. అప్పటి యుపిఎ, ఎన్‌డిఎలు సంయుక్తంగా రాష్ట్రాన్ని విభజించడం అందరికీ తెలిసిందే. తీవ్రంగా నష్టపోయిన ఆంధ్ర రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ తొమ్మిదిన్నరేళ్లుగా నీరోడుతోంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విభజిత ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చిన ప్రధాన హామీల్లో ఏఒక్కటినీ అమలు చేయలేదు. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో రాయలసీమ ముందజంలో ఉంది. ఇటువంటి ప్రాంత అభివృద్ధి పట్ల కేంద్రంలోని బిజెపి సర్కారు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ తాజాగా కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం మాతోనే సాధ్యమనే పేరుతో బస్సుయాత్రకు శ్రీకారం చుట్టింది. తెలుగు రాష్ట్రాల మధ్య సమన్యాయం చేయ కుండా కాంగ్రెస్ వివక్షను పాటించింది. కాంగ్రెస్ చేసిన తప్పిదానికి విభజిత రాష్ట్ర ప్రజానీకం తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పాదుకునేందుకు వివిధ రకాలుగా ప్రయత్నాలు చేస్తూవస్తోంది. గతంలో చేసిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీని మరోసారి తెర మీదికి తీసుకొచ్చింది. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం తొమ్మిదిన్నరేళ్లుగా రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాల్ని చేపట్టిన సంగతి తెలిసిందే. పార్లమెంటులో యుపిఎ, ఎన్‌డిఎ సంకీర్ణ సర్కార్లు సంయుక్తంగా ఇచ్చిన హామీ లను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీసిన పాపాన పోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల సమరం సమీపించిన నేపథ్యంలో మరోసారి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ యాత్రల పేరుతో ముందుకు వచ్చింది. గతంలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి కడప ఉక్కు బహిరంగసభలో పాల్గొన్న సమయంలో ప్రతిపక్ష పార్టీ హోదాలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో నిలదీసిన ప్రయత్నం చేసి ఉంటే ప్రయోజనం ఉండేది. ఎన్‌డిఎలోని బిజెపి ప్రభుత్వం ఫీజుబులిటీ లేదనే పేరుతో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం సాధ్యం కాదని నాటకాలు ఆడుతుండడం తెలిసిందే. కడపలో ఐరన్‌ఓర్, డోలమైట్, సున్నపురాయి, ఇతర ముడి ఖనిజ వనరులు పుష్కలముగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటువంటి ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం సాధ్యం గాకపోవడ మేమిటి, ఎటువంటి ముడి ఖనిజాలు లేని ముంబయ్, బెంగళూరు, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉక్కు పరిశ్రమలు ఎలా లాభసాటిగా నడుస్తున్నాయో తెలియజేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో బిజెపికి ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేకపోవడం వల్లే తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ప్రస్తుత ప్రపం చార్థికానికి రియల్ రంగం ఊతమిస్తున్న నేపథ్యంలో ఉక్కు ఉత్పత్తుల వినియోగం రెట్టింపు అవసరమనే నివేదికలు ఘోషిస్తుండగా దేశంలోనే అంత్యంత వెనకబడిన ప్రాంతమైన రాయలసీమ ప్రజల జీవితాలతో కాంగ్రెస్, బిజెపి ఆడుకోవడం ఆందోళనకరం. ఏదేమైనా కేంద్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు సంయుక్తంగా సెయిల్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

పేదల సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పేద ప్రజల సంక్షేమమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసిపి నాయకుడు జి.కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గురిజాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిదనంచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి షేక్ ఆయేషా వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ రామశేఖర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగలింగారెడ్డి, తహశీల్దార్ మహబూబ్ బాషా, పిఒఆర్‌డి పద్మనాభరెడ్డి, వైద్యులు భాజాముద్దీన్ సాహెబ్, హుస్సేన్, నారాయణరెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోష్టికాహారం

కృష్ణా బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది బోర్డు కార్యాలయాన్ని హైదరాబాద్ నుండి రాయలసీమలోని కర్నూలులో ఏర్పాటు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి సూచించారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నుండి విజయవాడకు కృష్ణానది బోర్డు కార్యాలయాన్ని తరలించేందుకు నిర్ణయించడం గర్హనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 సెక్షన్ 85 ప్రకారం విభజన జరిగిన 6నెలల్లోపు కృష్ణానది కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని చెప్పారు. కాని తొమ్మిదిన్నర సంవత్సరాలైన ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కాలేదన్నారు. బిజెపి, టిడిపి, వైసిపి చేతగాని తనం ఇందుకు నిదర్శనం అన్నారు. కృష్ణానదిపై ఉన్న తెలుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, ఎస్‌ఆర్‌బిసి, వెలుగొండ ప్రాజెక్టులు అన్ని రాయలసీమలోనే శ్రీశైలం రిజర్వాయర్‌కు ఆధారంగా ఉన్నట్లు చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కృష్ణానది బోర్డు కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు.

వాణిజ్య పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

వాణిజ్య పంటల సాగుపై అవగాహన అవసరమని కెవికె కో-ఆర్డినేటర్ విజ్ఞానాథ్ సూచించారు. వరిసిఐ కృషి విజ్ఞాన కేంద్రం శనివారం మైదుకూరు రకం పసుపు, బెండ పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైదుకూరు ప్రాంతంలో బెండ, మటిక విత్తనం కోసం ఎన్‌హెచ్‌ఆర్‌డిఎఫ్ వారు రైతులకు విత్తనాలు పంపిణీ చేసి సాగును ప్రోత్సాహిస్తున్నారన్నారు. కెవికెలో వాణిజ్య పంటలను సాగు చేయించామన్నారు. బెండ మొదటి కోత పూర్తయిందని, ఇక విత్తనం కోసం పంటను పరిశీలించామన్నారు. పంట దిగుబడి బాగా వస్తే మైదుకూరు ప్రాంతంలో విస్తృతంగా విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. శాస్త్రవేత్త ఫిరోజ్, రైతు సంఘం నాయకులు బిపివి ప్రతాప్‌రెడ్డి, జి రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

'కొనిరెడ్డి' అలా మాట్లాడడం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొత్తపల్లి గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అహం తలకెక్కి మాట్లాడుతున్నారని, ఈ విధానం తగదని వైసిపి కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు. శివచంద్రారెడ్డి ఎమ్మెల్యే రాచమల్లుపై చేసిన పత్రికా ప్రకటన నేపథ్యంలో కౌన్సిలర్లు స్పందించారు. ఆ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్లు ఖాజా మాట్లాడుతూ కొత్తపల్లి వార్డు సభ్యులను ఎమ్మెల్యే సంతలో పశువుల్లా కొన్నట్లు రూ.8లక్షలకు కొన్నట్లు తెలిపారని, ఇందుకు ఆధారమేమైనా ఉందాని అడిగారు. కౌన్సిలర్లు అమ్ముడుపోతారని చెప్పారని ఇందుకు సాక్ష్యం ఏమైనా ఉందాని ప్రశ్నించారు. కొత్తపల్లెకు కొనిరెడ్డి అనకొండలా తయారయ్యారని, వార్డు సభ్యులను ఏమాత్రం పట్టించుకోకపోవడం అసహ్యించుకొని వారంతా స్వచ్ఛందంగా ఎమ్మెల్యే రాచమల్లును ఆశ్రయించారన్నారు. కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ కొనిరెడ్డి సర్పంచ్‌గా గెలిచేందుకు ఎమ్మెల్యే సహకారం తీసుకొని, ఇప్పుడు ఇలా మాట్లాడడం తగదన్నారు. టిడిపి పక్షాన ఉండి ఆరోపణలు చేస్తే సరిపోతుందన్నారు. ప్రజాప్రతినిధులను పశువులతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొనిరెడ్డి చేస్తున్న ఆరోపణలపై కాణిపాకం వెళ్లి ప్రమాణం చేయాలని, తామందరం అక్కడికి వస్తామని గరిశపాటి పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు జిలాన్, వడ్ల ఖలీల్, పిట్టా బాలాజీ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో నూతన మార్పు : ఎంఇఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఒక నూతన మార్పును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని ఎంఇఒ పరమేశ్వరయ్య అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బాలాజీ హైస్కూల్‌లో శిక్షా ఏక్ సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ఉపకరణాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆర్. భరత్‌కుమార్‌ను ఎంపిక చేయడం, ఆయన శుక్రవారం పిహెచ్‌డి పట్టా పొందడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. బాలాజీ హైస్కూల్ కరస్పాండెంట్ బైరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఇక్కడే చదివి, ఇక్కడే ఉపాధ్యాయుడిగా, ఒక అధ్యాపకుడిగా, బిఇడి ప్రిన్సిపల్‌గా పని చేస్తూ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ పొందడం చాలా సంతోషించదగ్గ విషయ మన్నారు. పాఠశాల తరుపున అభినందనలు తెలిపారు. ఆర్.భరత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం, ఎంఇఒ, తోటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఎఒ కెవివి ప్రసాద్‌రెడ్డి, సీఆర్పీ రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంఇఒ, కరస్పాండెంట్, ఎఒ

జ్వరాలతో ప్రజలు విలవిల

రోగులతో కిటకిటలాడుతున్న దువ్వూరు ప్రభుత్వాసుపత్రి

ప్రజాశక్తి - దువ్వూరు

గొంతు గరగర, జలుబు వాతావరణ మార్పులతోను గత 20 రోజులుగా ప్రజలు విలవిల్లాడిపోఉతన్నారు. విష జ్వరాలు, గొంతునొప్పి తీవ్రత ఎక్కువగా ఉందని వాపోతున్నారు. టైఫాయిడ్, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌తో ఇంటిల్లిపాది మంచాన పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జబ్బులు ఒకరినుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అంతా దగ్గు, జ్వరం పట్టుకుంది. ఏ ఇంట్లో చూసినా ఇద్దరు, ముగ్గురు.. కొన్నిచోట్ల ఇంట్లో అందరూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఖణేల్ మంటూ దగ్గుతూనే ఉన్నారు. రాత్రి వేళల్లో నిద్రకు తీవ్ర ఆటంకం కలుగుతూ ఇతర వ్యాధులు వస్తున్నాయని హడలిపోతున్నారు. దగ్గుతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన వల్లే ఈ సమస్య ఏర్పడిందని. గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి దగ్గు, జ్వరం వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా పదిహేను, ఇరవై రోజుల నుంచి ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. పాఠశాల్లో దగ్గు వినిపించని తరగతి గదిలేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇక కార్యాలయాల్లో కూడా అదే పరిస్థితి. వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా పెద్దల నుంచి పిల్లల వరకు అందరూ తీవ్రమైన దగ్గు, జ్వరం, జలుబు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. దాదాపు అన్నిచోట్లా జర్వం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య బాగా పెరిగిననట్లు ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ధ్రువీకరించారు. చిన్నారుల్లో అయితే రోజుల తరబడి జలుబు, దగ్గు సమస్యలు వేధిస్తున్నాయి. గతేడాది ఇదే సీజన్‌లో ఇంతలా ఇలాంటి వ్యాధుల ప్రభావం లేదని అంటున్నారు. డెంగీ, టైఫాయిడ్, గ్యాస్ట్రోసిస్ కేసులు కూడా పెరుగుతున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. సాధారణంగా వారం రోజులు ఉంటే దగ్గు, జలుబు సమస్యలు తగ్గిపోతాయి. కానీ ఈసారి మాత్రం అవి నెల రోజులపాటు వేధిస్తున్నాయి. యాంటీబయాటిక్స్ వాడినా కూడా ఉపయోగం ఉండడం లేదని బాధితులు వాపోతున్నారు. తీవ్రమైన దగ్గు ఉంటుంది. గొంతు గరగర అని పిస్తుంది. కొందరిలో పొడిదగ్గు. ఎక్కువ మందిలో తెమడతో కూడిన దగ్గు వస్తోంది. రోజుల తరబడి ఉంటుంది. దగ్గుతోపాటు జలుబు, జ్వరం, ముక్కుకారడం, తలనొప్పి, వాంతులు ఉంటున్నాయి. రోజుల తరబడి దగ్గు తగ్గకపోవడం కనిపిస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి : వైద్యులు

చలి గాలిలో తిరగడం మానుకోవాలి. బయటకు వెళితే మాస్కు ధరించాలి. చల్లని ఆహార పదార్థాల జోలికి వెళ్లకూడదు. గొంతు గరగరగా ఉంటే గోరు వెచ్చటి నీటిలో కొంచెం ఉప్పు వేసుకొని పుక్కిలించాలి. దగ్గుతో బాధపడే చిన్నారులను పాఠశాలకు పంపొద్దు. మూడు నాలుగు రోజులైనా దగ్గు, జ్వరం తగ్గకుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రందించాలి. వాతావరణంలో మార్పుల వల్ల వైరస్ విజంభిస్తోంది. ఫీవర్ ఆస్పత్రికి వచ్చే ఒపి ఒక్కసారిగా రెండు రెట్లు పెరిగింది. ప్రధానంగా జ్వరం, జలుబు, దగ్గుతో వచ్చే రోగులు ఎక్కువగా ఉన్నారు.

అధికంగా వైరస్ వ్యాప్తి : కొవిడ్ తర్వాత మాస్కులు వాడడం లేదు. బహిరంగ ప్రదేశాలకు వెళితే మాస్కులు తప్పనిసరిగా ధరించాలి. ఎవరికైనా జలుబు, దగ్గు ఉంటే వారి నుంచి ఇతరులకు చాలా వేగంగా వ్యాప్తి చెందుతోంది. మూడు రోజుల పాటు జ్వరం తగ్గకుండా ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. దగ్గు ఎంతకీ తగ్గకపోతే నెబులైజర్ వాడాలి. నెబులైజర్ వాడిన వారిలో మూడు నాలుగు రోజుల్లోనే దగ్గు తగ్గిపోవడం గమనించాం. ప్రస్తుతం దాన్నే ఎక్కువగా సిఫారస్ చేస్తున్నామని వైద్యులు అంటున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ

రైతుల మేలు కోరే చీనీకాయల కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

చీనీ రైతుల మేలు కోరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల మార్కెట్ యార్డ్‌లో చీనీకాయల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. చీనీ కాయల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ముందుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ట్రైనీ కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డులో జరుగుతున్న చీనీ కాయల వేలం పాటను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులు, వ్యాపారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో ప్రతిరోజు వంద టన్నుల చీనీ కాయల వేలం పాట జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో సూట్ విధానంతో రైతులు చాలా నష్టపోయేవారని తెలిపారు. సూల్ లేకపోవడంతో రైతులు లబ్ధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సిబ్బంది, రైతులు, చీనీ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

చీనీకాయల వేలం పాటను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లి పంచాయతీ ప్రకాష్‌నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఎంపిపి సానబోయిన శేఖర్‌యాదవ్ పరిశీలించారు. మురుగు కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను సచివాలయాల ద్వారా గుర్తించి పరిష్కరించాలనే ఉద్దేశంతో సిఎం జగన్ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. భారతదేశ చరిత్రలో ఈ తరహా ఆలోచించేసిన ఏకైక వ్యక్తి మన ముఖ్యమంత్రి అన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలాన్ని ప్రగతిపథంలో నడుపుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకాష్‌నగర్ వైసిపి నాయకులు కంభం వెంకటేశ్వర్లు, పుల్లయ్య, పాల్గొన్నారు

బెస్ట్ బేకరీపై తనిఖీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక కడప రోడ్డులో ఉన్న బెస్ట్ బేకరీ తినుబండారాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని ప్రజలు శానిటరి ఇన్‌స్పెక్టర్ మురళీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆయన శనివారం తన సిబ్బందితో బేకరీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బూజు పట్టిన బ్రెడ్లు, కేక్‌లు, కొన్ని స్వీట్లు పరిశీలించగా దుర్వాసన వెదజల్లుతుండడంతో మురళీధర్ యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్వాసన వెదజల్లుతున్న, బూజు పట్టిన తినుబండారాలను మున్సిపల్ సిబ్బందితో చెత్త కుండీలో వేయించారు. ఫ్రిడ్జ్‌లో నెలల తరబడి ఉంచిన తినుబండారాలను కూడా చెత్త కుండీలో వేయించారు. పులివెందులలో ప్లాస్టిక్ నిషేధం ఉన్నప్పటికీ మీరు ఎందుకు వాడుతున్నారని, అలా వాడడం తప్పని బేకరీ యజమానులకు రూ.5000 జరిమానా విధించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మున్సిపాల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. పార్టీ నాయకులతో కలిసి వారు శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నగిరిగుట్టలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, ఏ పథకాల ద్వారా లబ్ధి పొందారో తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫిజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, కిషోర్, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, వైసిపి నాయకులు రసూల్, పద్మనాభ ఒడ్డి, వీరారెడ్డి, దేరంగుల చంద్రమౌళి, డేనియల్, మధుసూదన్ రెడ్డి, రాజేష్ నాయుడు, వెంకటసుబ్బయ్య, చలపతి, సంపత్, ఫక్రుద్దీన్, సోమశేఖర్, సచివాలయ ఉద్యోగులు, వాలంటరీలు పాల్గొన్నారు.

ఎస్‌విడిసి ఆధ్వర్యంలో స్త్రీ జాగృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఎస్‌వి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్త్రీ జాగృతి కార్యక్రమంలో భాగంగా 'అమ్మాయిలకు చదువు ఎంతో అవసరం' అనే విషయంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎద్దుల వెంకట సుబ్బమ్మ హైస్కూల్‌లో ఉన్న విద్యార్థినులకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి గౌరీశంకర్ అమ్మాయిలకు చదువు, దానివల్ల కలిగే ప్రయోజనాలు, వారి జీవిత అభివృద్ధికి చదువు వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు కాశీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

బాల్య వివాహాలను అరి కట్టాలంటే స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన చాలా అవసరమని మెప్మా అధికారి ఎల్.గంగులయ్య తెలిపారు. శనివారం జమ్మలమడుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విజేత పట్టణ మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సంఘ సభ్యులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సిడిపిఒ రాజేశ్వరిదేవి మాట్లాడుతూ చట్టాలను వ్యతిరేకిస్తే రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. సంఘ సభ్యులు అందరితో బాల్య వివాహాలను అరికట్టాలని ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రసూలమ్మ, ఉషారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గౌసియా, స్వయం సహాయక సంఘ లీడర్లు, ఆర్పీలు, సచివాలయం మహిళ పోలీసులు పాల్గొన్నారు.

సంఘ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

వన్య ప్రాణులను రక్షించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వన్య ప్రాణులకు హాని చేయకుండా రక్షించాలని అటవీశాఖ సబ్ డిఎఫ్ఒ దివాకర్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవులు, అడవి జంతువుల రక్షణపై బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ చంద్రశేఖర్ రావు, సిబ్బంది కాశిరెడ్డి, రత్నరాజు, నారాయణ స్వామి, పద్మనాభయ్య, సుబ్బారాయుడు, సుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులు రాజబాబు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న డ్రయినేజీ కాలువ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మురుగు కాలువల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే సిసి రోడ్లు వేసేందుకు కూడా లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, వైస్ చైర్మన్ షరీఫ్, మునిసిపల్ కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు మునిసిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని అల్లాడుపల్లి గ్రామంలో ఆయన గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లాడుపల్లె ఎస్సీ కాలనీలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపిపి లక్ష్మమయ్య, సర్పంచ్ జిఎం కిషోర్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ యామిని, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఎఒ మ్యాగీ, వైసిపి నాయకులు శేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, శ్రీనువాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఈనెల 12,13 తేదీల్లో రెండు రోజులపాటు జమ్మలమడుగు పట్టణంలోని ప్రజలకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు జమ్మలమడుగు నగర పంచాయతీ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని దొమ్మర నంద్యాల వద్ద ఉన్న జలాశయాలను శుభ్రం చేస్తున్నందున నీటి సరఫరాను నిలిపేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు. ఎంపిడిఒ కార్యాలయ రోడ్డు, అమ్మవారిశాల వీధి, అంబ భవాని వీధి, మచ్చర్ల వీధి, చాకలి వీధి, కమ్మరి వీధి, మార్వాడీ వీధి, గడ్డ వీధి, డొంక వీధి, దుత్తలూరు నగర్, రోటరీ నగర్, సొసైటీ కాలనీ, నేతాజీ నగర్, ఎత్తవువారి కాలనీ, బ్యాంకు కాలనీ, దిగువ పట్నం కాలనీ, లక్ష్మీ నగర్, వెంకటేశ్వర కాలనీ, భాగ్యనగర్ కాలనీ, రామిరెడ్డిపల్లె రోడ్డు, పెద్దపసుపుల మోటు, టీచర్స్ కాలనీల్లో ఆ రెండు రోజులు నీటి సరఫరా ఉండదని కమిషనర్ వివరించారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు 40వ వార్డు పల్లా లక్ష్మీదేవి, 28 వార్డు లక్ష్మీదేవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ, సావిత్రి, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు దీక్షలో కూర్చున్నారు. వీరికి మద్దతుగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, ప్రొద్దుటూరు రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, 8వ వార్డు సురసుర, 9వ వార్డు కరీముల్లా, ముదిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నియోజకవర్గ టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : వైసిపి నాయకులు ఎన్ని కుయుక్తులు పండినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రిలే దీక్షలో భాగంగా శనివారం పులివెందులలోని టిడిపి కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి, తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, సింహాద్రిపురం సీనియర్ నాయకులు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, అన్నా రెడ్డి ప్రసాద్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అమర్, పార్లమెంటరీ కార్య దర్శి బొజ్జ మైసూరారెడ్డి, లింగాల మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో 'బాబుతో నేను'

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : బాబుతో నేను అంటూ చంద్రబాబు అరెస్టుపై ప్రజలకు వివరిస్తూ పట్టణంలోని శ్రీరామ నగర్, కేశవ్ నగర్‌లో టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంటింటికీ తిరిగారు. కార్యక్రమంలో పల్లా లక్ష్మీదేవి, పల్లా సాయిరాం, సావిత్రి, బుర్ర సాదు, మఠం బాషా, అంజనమ్మ, అంబటి ప్రసాద్, పొట్టిపాటి గంగాధర్, మోత్కూరు వెంకటసుబ్బయ్య, కృష్ణారెడ్డి, భోగాల లక్ష్మీనారాయణమ్మ, 28వ వార్డు లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బారాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ముద్దనూరు : బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజబాబు, పీడీ మాధవరెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జమ్మలమడుగులో ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో శివకీర్తి, గురువాసంతి, ఖోఖోలో భవజ్ఞ, వైష్ణవి, ఖోఖో అండర్-17 బాలుర విభాగంలో ఓబులేసు, వెంకట తేజ, రాజు, కబడ్డీలో రాజు, హుస్సేన్ ఎంపికైనట్లు చెప్పారు. కబడ్డి అండర్-14 బాలికలు హనీషా, స్వాతి, రేష్మ, దీపిక, ఖోఖోలో స్వాతి, బాలురు ఖోఖోలో లక్ష్మి నరసింహ, దిల్షాన్, హర్షవర్ధన్, కబడ్డీలో మణికుమార్ ఎంపికైనట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ రెవెన్యూ పొలం 1397 సర్వేనెంబర్‌లో పేదలకు దక్కవలసిన అసైన్డ్ భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సానా గోవింద్ మాట్లాడుతూ 2006, 2007లో అప్పటి ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సోమిరెడ్డిపల్లె రెవెన్యూ పొలంలో దాదాపు వంద మంది ఎస్సీ, బిసిల పేదలకు డికెటి పట్టాలు, పాస్ పుస్తకాలు మంజూరు చేశారన్నారు. పది రోజులుగా కొందరు యంత్రాలతో ఆ భూములను చదునుచేస్తూ కంచె ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణం రెవెన్యూ అధికారులు స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎద్దు రాహుల్ ,భాస్కర్ పాల్గొన్నారు.

డిటికి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

డ్రోన్‌పై విద్యార్థులకు అవగాహన

పులివెందుల రూరల్ : పులివెందుల జెఎన్‌టియూ కళాశాలలో శనివారం 2వరోజు డ్రోన్ టెక్నాలజీ మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా డ్రోన్‌ని ఎలా వినియోగించాలనే అనే అంశంపై వేణుగోపాల్‌రెడ్డి శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ అనేక విధాలుగా రైతులకు ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్‌తో కూడా మందులు పిచికారి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 221/2022 IN
O.S.No. 181/2022

Patan Noorjahan, W/o. Late Patan Basheer Khan, aged about 60 years, Housewife, resident of D.No.19/270, Rameswarampeta Street, Proddatur Town and Mandal, YSR Kadapa District.
...Plaintiff/Petitioner

Vs

Smt Peerla Fakrunnisa, W/o Peerla Rabbani, aged about 52 years, Housewife, Resident of D.No. 9/22, Devanga Street, Vempalli Town and Mandal, YSR Kadapa District-516329.
...Respondent No.3/ Defendant No.3

SUMMONS & NOTICES

పై నెంబరు I.A.No.221/2022 in O.S.No.181/2022 కేసులో రాజశ్రీ పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో రెస్పాండెంటు నెం.3 & డిఫెండెంటు నెం.3, పై రాజశ్రీ పులివెందుల జూనియర్ సివిల్ కోర్టు గారి ఉత్తర్వుల మేరకు ఈ సమన్లు మరియు నోటీసులను ప్రచురించబడు చున్నది. కావున వాయిదా తేది 27.10.2023న రెస్పాండెంటు నెం.3 & డిఫెండెంటు నెం.3, వ్యక్తిగతంగా గానీ, అడ్వకేట్ పరంగా గానీ మహారాజశ్రీ పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో హాజరు కావలసివున్నది లేని యెడల మహారాజశ్రీ పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు తగు చర్యలు తీసుకోనబడునని తెలియజేయడమైనది.

//By Order of the Hon'ble Court//
SYED KALEEMULLA,
వాది తరపున అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

Before the Honourable Deputy Registrar of Chits by Arbitrater : Kurnool.
Dispute No. 80/2023

Between :
M/s. Sri Balaji Nandi Chits (P) Ltd., Nandyal .... Disputant

-Versus-

1) P. Aswani
2) P.V.V. Ramana Kumar
3) B. Khadar Basha .... Opponents

OPPONENTS 1 TO 3 NOTICES

1) P. Aswani, D/o. P. John moses, H.No. 26-330-E3, Viswasapuram, Behind LIC Office, Nandyal.
2) P.V.V. Ramana Kumar, S/o. P. Rama Subbaiah, School Asst (English), Z.P. High School (Boys), Kandimallayapalli (V), B. Mattam (M), YSR Kadapa (D)
3) B. Khadar Basha, S/o. B. Shabbir Ahmed, School Asst. (Hindi), Z.P. High School, Kandimallayapalli (V), B.Mattam (M), YSR Kadapa (D).

పై దావా నందు Disputant Company వారికి రావలసిన బాకీ మొత్తం 2,27,468/- రూపాయలు మరియు ఖర్చులు వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 నుండి 3 Opponents అయిన మీరు 27-10-2023వ తేదీన ఉదయం 11-00 గంటలకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో తెలుపగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 27-10-2023

By order of the Deputy Registrar of Chits By Arbitrater, Kurnool.

IN THE COURT OF THE HONORABLE ADDITIONAL SENIOR CIVIL JUDGE: KADAPA

O.S.No.94/ 2003

Hamid Hussain S/o M.E. Shareef, Muslim, aged about 57 years, Secretary Cum Correspondent, Tayyab Muslim Welfare Society, residing at D.No.1/2336, A.P.H.B. Colony, Kadapa City and District. ...Plaintiff

Vs

1. Sambeta Soma Sekhar having died his L.Rs.
2. S.Siva Prasad S/o Late S. Soma Sekhar, Hindu, aged about 48 years, business, residing at D.No. 6/719, Sankarapuram, Kadapa City and District.
3. S.Nagendra Kumar, S/o Late S. Soma Sekhar, Hindu, aged about 43 years, business, residing at D.No.57/174-4-2, Sastri Nagar, Akkayapalli, Kadapa City and District.
4. S.Mohan Babu S/o Late S. Soma Sekhar, Hindu, aged about 41 years, residing at D.No.6/719, Sankarapuram, Kadapa City and District.
5. S.Suresh Babu S/o Late S. Soma Sekhar, Hindu, aged about 39 years, business, residing at D.No.37/1174-1-3-2-2, Vidyuth Nagar, Kadapa City and District.
6. S.Sridevi D/o Late S. Soma Sekhar, Hindu, aged about 27 years, Home maker, residing at Guthapalem Village, Kalikiri, Chittor District.
7. S. Lakshmi Devi D/o Late S. Soma Sekhar, Hindu, aged about years, Home maker, residing at D.No.6/719, Sankarapuram, Kadapa City and District.

...Defendants

నోటీసు

పై తెలిపిన దావాలో ఎస్.సోమశేఖర్ మీద దావా దాఖలు చేసియున్నారు. ఈ దావాలో మీ నాన్నగారైన ఎస్.సోమశేఖర్ చనిపోయినందున మిమ్మల్ని ప్రతివాది నెం.2గా చేర్చుటకు పైన తెలిపిన దావా దాఖలు చేసియున్నారు. ఆ దావాలో మీరు హాజరగుటకు గాను వాయిదా 31.10.2023న వున్నది. కావున మీరు పైన తెలిపిన కోర్టు నందు పైన తెలిపిన తేదీన ఉ॥10.30 ని॥లకు మీరుగానీ మీ తరపున వకీలు గానీ హాజర్రై ఆక్షేపణలు తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By the Order of the Court//
D. ARAVINDH
Advocate,
Kadapa. Cell:9849441072.

IN THE COURT OF THE HONORABLE ADDITIONAL SENIOR CIVIL JUDGE: KADAPA

I.A.No. 182/2022
O.S.No. 94/ 2003

Hamid Hussain S/o M.E. Shareef, Muslim, aged about 57 years, Secretary Cum Correspondent, Tayyab Muslim Welfare Society, residing at D.No.1/2336, A.P.H. B. Colony, Kadapa City and District. ...Petitioner/Plaintiff

Vs

1. Sambeta Soma Sekhar having died his L.Rs.
2. S.Siva Prasad S/o Late S. Soma Sekhar, Hindu, aged about 48 years, business, residing at D.No. 6/719, Sankarapuram, Kadapa City and District.
3. S.Nagendra Kumar, S/o Late S. Soma Sekhar, Hindu, aged about 43 years, business, residing at D.No.57/174-4-2, Sastri Nagar, Akkayapalli, Kadapa City and District.
4. S.Mohan Babu S/o Late S. Soma Sekhar, Hindu, aged about 41 years, residing at D.No.6/719, Sankarapuram, Kadapa City and District.
5. S.Suresh Babu S/o Late S. Soma Sekhar, Hindu, aged about 39 years, business, residing at D.No.37/1174-1-3-2-2, Vidyuth Nagar, Kadapa City and District.
6. S.Sridevi D/o Late S. Soma Sekhar, Hindu, aged about 27 years, Home maker, residing at Guthapalem Village, Kalikiri, Chittor District.
7. S. Lakshmi Devi D/o Late S. Soma Sekhar, Hindu, aged about years, Home maker, residing at D.No.6/719, Sankarapuram, Kadapa City and District.

...Respondents/Respondents/ Defendants & Proposed Party

నోటీసు

పై తెలిపిన దావాలో ఎస్.సోమశేఖర్ మీద పిటిషన్ దాఖలు చేసియున్నారు. ఈ పిటిషన్‌లో మీ నాన్నగారైన ఎస్.సోమశేఖర్ చనిపోయినందున మిమ్మల్ని రెస్పాండెంట్ నెం.7గా చేర్చుటకు పైన తెలిపిన పిటిషన్ దాఖలు చేసియున్నారు. ఆ పిటిషన్‌లో మీరు హాజరగుటకు గాను వాయిదా 31.10. 2023న వున్నది. కావున మీరు పైన తెలిపిన కోర్టు నందు పైన తెలిపిన తేదీన ఉ॥10.30 ని॥లకు మీరుగానీ మీ తరపున వకీలు గానీ హాజర్రై ఆక్షేపణలు తెలుపగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By the Order of the Court//
D. ARAVINDH
Advocate,
Kadapa. Cell:9849441072.